# ఇది కథా ?

అది జిల్లా కేంద్రం కాబట్టి జనం రాకపోకల రద్దీ, రోజుకు నాలుగు ఆటల సినిమాల సందడి, హోటళ్ళ హోరు, పోలీసుల హడావిడి, ఇంకా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిపోయే జనం. వీటన్నిటిని చూసిన మల్లయ్యకు "ఇంత మంది బతికే ఈ పట్టణంలో తాను గూడ తప్పక బతకొచ్చు" అన్న నమ్మకం కుదిరింది.

ఓ చౌరస్తా కార్నర్‌లోని పెట్రోల్ బంక్ పక్కమ్మటే తన అడ్డా జమాయించి కూర్చున్నాడు. అతని చుట్టూరా అతని పనిముట్లు. ఓ పాత రేకు డబ్బాలో చెప్పులకు కొట్టే మొలలు. దాని పక్కనే మూత తీసేసిన నల్లని పాత బ్యాటరీ డబ్బాలో నీళ్ళు. రిపేర్ల కోసమని కొన్ని తోలు పేలికలు, పాలిష్

డబ్బాలు, దారం, మైనం వగైరాలన్ని సర్దిపెట్టుకున్నాడు. పాలిష్ చేయడం ఇక్కడి కొచ్చినాకనే నేర్చుకున్నాడు.

దసరా పండుగ రెండు రోజులుందనఁగా స్కూళ్ళకు సెలవులిచ్చారు. కార్యాలయాలు గూడా సరిగ్గా నడుస్తున్నట్టు లేవు. అందువల్ల ఇద్దరో, ముగ్గురో వస్తున్నారు.

మిట్ట మధ్యాహ్నం. గోడ నుండి గుంజికట్టిన బస్తా నీడలో కూర్చున్న మల్లయ్యకు రేపు పండుగనాడు కూడా పస్తు ఉండాల్సి వచ్చేట్టుగ ఉందనిపించేసరికి ఒళ్ళంతా తేలిపోయి నట్టనిపించింది. చుట్టూ చూసి అంతకుముందెప్పుడో సగం కాల్చి చల్లార్చి దాచుకున్న చుట్ట ముక్కను తీసి వెలిగించుకున్నాడు.

ఈ పీల్చిన పొగైనా కడుపులో ఉండిపోతే బాగుండు, కాస్త ఆకలి కాకుండా ఉండేది. ఇదీ మళ్ళీ బయటికెళ్ళి పోద్ది, అనుకుంటూ ఎడమ చేత చుట్టను పట్టుకొని దాన్నే చూస్తూ ఉండిపోయాడు. అలా చూస్తున్న మల్లయ్యకు తన ఊరు జ్ఞప్తి కొచ్చింది. ఊరితో పాటు తన తల్లి, తండ్రి, అప్పటి తన బతుకు అతని కళ్ళ ముందుకొచ్చింది.

తనకు తెలివి వచ్చినప్పటి నుండి...

తండ్రి ఎగసాయపు పనులు చేస్తూ ఆసాముల తొండాలు, చెప్పులు కుట్టేటోడు. తన తల్లి కలవడం, కోయడం, కల్లాలు ఊడ్చడం, వొచ్చే కూలిగింజలతో పూట గడిసేది.

తాను ఎదగినంక తాను, తన పెండ్లం ఆ పనులే. అవే

కూలిగింజలు. చావులకు, పెళ్ళిళ్ళకు, పండుగలకు పబ్బాలకు డప్పు వాయించేది. ఇంత బత్తెమో, సత్తెమో యిచ్చెటోల్లు. దేవుని సేవలు, సర్కారోళ్ళ సాటింపులు ఉత్తగనె !

ఎట్టిసాకిరిసెయ్యొద్దని సీకటోల్లు ఊరూరా సభలు చేసి సెప్పబట్టిరి. అంతల్నే మందల తోడేండ్లు పడ్డట్టు రజాకార్లు ఊర్లమీద పడి కూరకోత కోసిరి, కాల్చి సంపిరి. దొరలు, జాగీరుదారులు ఆల్ల కాల్లకాడ కుక్కలైరి.

ఎట్లనో అట్ల తెల్లోల్లు ఎల్లిపోయిరి. నైజాము నాశనమాయె. వోట్ల రాజ్యం వచ్చి అందరు కలసి బతకాలనిరి.

దున్నేవాడికే భూమి అనిరి. బంచరాయి, పోరంబోకు భూములను....మాల, మాదిగల పేర్లు మార్చి హరి జనులని...తలా యింత పట్టాలిచ్చిరి. ఆటిల్ల తవ్వితే బాయి పడదాయే, దున్నితే సాలు రాదాయే. అయినా ఎకరం, అరెకరం ఎగసాయానికి ఎడ్లు, నాగళ్ళు ఎక్కన్నించొస్తయి? అవన్నీ మల్లా బంజర్లు అయి ఊర పసుల పాలాయే!

కాయకస్టం సేసిసేసి రెక్కలుడిగిపోయి, అమ్మ...అయ్య రోగాల నొప్పులతో కాలం సేసి మంటకల్సిరి.

తల్లీ...తండ్రీ గుర్తు రాగానే మల్లయ్య కళ్ళల్లో నీటి పొర కమ్ముకుంది. •ఎదురుగా వొచ్చిపోయే వాహనాలు మసక మసకగా కనిపించాయి. ఒకసారి అటు, ఇటు కదిలి కూర్చుని కళ్ళనీళ్ళొత్తుకున్నాడు.

దరిద్రులను ఉద్ధరిస్తం అని సర్కారోళ్ళు అప్పులిచ్చి

తోల్లయాపారం చేయమనిరి. అమ్మ...యిగ బతుకులు మారిపోతయని ఆశపడి, సేసే పనులొదిలిపెట్టి తోల్లు తెచ్చి పోతం జేస్తే ఆ రోజుల్లో ఆటిని కొనే దిక్కే లేదాయే.

రబ్బరు సెప్పులొచ్చి తోలు సెప్పులు తొలిగె. ఇంజన్లు, మోటార్లొచ్చి తొండాల పని తీరిపోయె....తోల్లబేరం సాగకపాయే. మా నేల్లల్లో మన్నుపడే మద్దెన కర్నపోడు తీసుకున్న అప్పు తిరిగి యియ్యక తప్పదని ఆ అరెకరాన్ని అమ్మిచ్చె. ఆ తరువాత తెలిసింది కాలంగాక కరువచ్చిందని, యిచ్చిన అప్పులు మాపైనవని. సర్కారోడు సాయంజేసినా, మద్యోడు మాయజేసె.

ఆ తరువాత ఎలచ్చన్లొచ్చె.వద్దన్న పార్టీకి వోటెసింద్రని పగలు పెరిగి, ఎప్పుడో పటేలు కొడుకు మా కులపు పిల్లను గుంజితె కట్టేసి కొట్టినందుకు మనసుల పెట్టుకున్న పటేలు ఊరందర్ని ఊసికొల్పి మా పాకలకు నిప్పుపెట్టిచ్చె. పోలీసోళ్ళు వాల్ల పాటే పాడిరి. ఇంతల మావోడె ముఖ్యమంత్రె ఊరికొచ్చి, కాలిన మా పాకలు నూసి, ఊరమ్మటే తలా ఓ ఇల్లు కట్టిస్తే, గాలికి కప్పు లేసిపాయె, ఆనలకు గోడలు కూలిపాయె. మల్లా చెట్టుకింద బతుకులేనాయె.

* * *

"జర ఈ చెప్పుల సంగతి చూడు" అంటూ చెప్పులను మల్లయ్య ముందు వదిలాడు ఓ వ్యక్తి.

వదిలిన చెప్పులను చేతుల్లోకి తీసుకున్నాడు మల్లయ్య.

"నిన్నెక్కడో చూసినట్టుంది" సిగరెట్ ముట్టించుకుని కాలుతున్న పుల్లను పారేస్తూ అన్నాడు.

"నన్నా? చెప్పు మీద మొలను ఉంచి ఆ వచ్చిన పెద్దమనిషి వైపు చూశాడు.

"నీది రాంపల్లి అనుకుంటా". అడిగాడు పీల్చిన పొగను ముక్కుల ద్వారా వొదులుతూ.

"అవునయ్యా".

"నన్ను గుర్తుపట్టలే, నీకు ఓ జర్సి ఆవును ఇప్పిస్తిని గదయ్యా! అప్పుడక్కడ నేను వి.డి.వోగ ఉంటిని".

"ఆః ఆః" అంటూ నోరు తెరచిచూస్తూ గతాన్ని గుర్తుకు తెచ్చుకోసాగాడు.

"అప్పుడు నీ ఫోటో పేపర్లో వేసిరి. నీ పేరు రేడియోలో చెప్పిరి. నీ పేరు మల్లయ్య గదు?"

"ఆః" అంటున్నప్పుడు ఆవును ఇచ్చిన రోజు కళ్ళల్లో కదిలింది.

"ఇక్కడొచ్చి ఎన్నాళ్ళైంది?"

"ఐదేండ్లు అయిపాయె" అంటూ చెప్పుమీది మొలను గూటంతో గుద్దాడు.

"మరి ఆ ఆవును ఏం చేసినవ్?"

"యింకెక్కడి ఆవు"

"అదె ఎక్కడపాయె'

"ఆవు సచ్చె, దూడ సచ్చె". అప్పుడు ఆయన గుండెలో

నుండి బాధతో కూడిన గొణుపు ఓటి వచ్చింది.

"అరే సచ్చిందా ! ఎట్లా" కాలిన సిగరెట్టు నుసినే పక్కకు దులుపుతూ అడిగాడు.

"ఎందుకు సచ్చిందని పసుల డాక్టర్ని అడిగితే మూతి యిరిసెండు గానీ ఏం సెప్పలేదు" అంటూ చెప్పుకు బ్రష్ కొట్టి ఆయన ముందుంచాడు.

"అట్లానా అది బతికితె నీవు బాగుపడెటోనివే" అంటూ ఓ రూపాయి ఇవ్వబోయాడు.

"వొద్దు సారు, గింత పనిక గూడ పైసలా? తమరెంత సాయం సెయ్యలేదు గప్పుడు" అంటూ చేతులు జోడించాడు. లేని నవ్వును తెచ్చిపెట్టుకుంటూ ముఖంలో మారిన రంగును కనపడకుండ దస్తీని మూతికి అడ్డుపెట్టుకుంటూ అక్కడి నుండి కదులుతూ ఇవ్వడానికి తీసిన రూపాయని తిరిగి జేబులో వేసుకున్నాడు.

ఒక్కసారి గతం కళ్ళముందు కదలాడింది.

ఈయనకు సహాయం చేశానా!

అసలు ఆ ఆవు ధర ఎంత?

"నాలుగు వేలు".

రసీదు ఎంతకు తెచ్చినం

"ఆరు వేలకు".

మిగతా రెండువేలు?

"మా కమీషన్". సిగరెట్ పూర్తిగ కాలడం వల్ల వేళ్ళకు సెగ

తగలగానే దాన్ని పక్కకు విసిరాడు.

అయితే ఈయనకేమి చేసినట్టు?

"సహాయం అయితె కాదు".

మరీ

"మోసం"

ఆ మోసం నేను చేయలేదు, సర్పంచ్ చేయించాడు. అందరం కలసి పంచుకున్నాం.

మల్లయ్య 'సహాయం చేశారు' అని చేతులు జోడించినపుడు చెంపమీద కొట్టినట్టు అనిపించింది.

అందుకే జేబులోని దస్తి ముఖం మీదికొచ్చింది.

అంతేకాద, ఆ రోజు ఆవును ఇంట్లో కట్టేసుకుని చేతికి అందించిన రెండుకోడిపుంజులు గుర్తొచ్చినవి. పేదోనికి మేలు చేస్తే అది పెరటి తోట అయిపోతుంది. అయినా వాళ్లని తిప్పుకుంటాం. అప్పుడు చేసే పనిని ఆరు నెలలు సాగతీస్తాం!'

"అన్యాయం, అన్యాయం"అంటూ నడుస్తున్నాడు. ఆ మాటలు బైటికి వినపడగ రిక్షావాడొచ్చి పక్కన్నెఆపుతూ "రిక్షా కావాల్న సార్" అనగానె, "ఆః" అంటూ అందులో కూర్చుని "జిల్లా పరిషత్‌కు పోని"అన్నాడు.

* * *

మల్లయ్య బుర్రలో ఆవును గూర్చిన ఆలోచనలు కదిలాయి. అది ఈ దేశపు ఆవు కాదు. పెద్ద రకపు ఆవు. పూటకి పదిసేర్ల పాలిచ్చే ఆవు. ఆ రోజు మంత్రిగారు ఆ ఆవు

తగులు నా చేతికిస్తున్న ఫోటోను తెల్లారి పత్రికల్లో ఏసింద్రు. తన పేరును రేడియోలో చెప్పింద్రు. ఆవు వచ్చినందుకు సంతోషం, పేరు అందర్కి ఎర్కైనందుకు సంతోషం గానీ, దానికేమి రోగమో ఇంటికొచ్చినంక రోజు ఇన్ని పాలు తక్కువియ్యటం మొదలుపెట్టె! నెల దాటేవరకు పూటకు పదిసేర్లు పోయి రెండోనెలలో ఐదుసేర్లకొచ్చె. మూడవ నెలలో దూడకు పుర్రుబెట్టె, ఆవు సగమాయే ఇట్లెందుకైందని పసుల డాక్టర్ని అడిగితే...

"ఈ ఆవుకు ఎండ తగులొద్దు, మేత బాగుండాలె" అనె.

మరి చెల్కలల్లకు కొట్టుకపోయి మేపుక రాకపోతే ఎక్కడ మేపను అది ఉండటానికి సల్లగ ఉండాలంటే ఉన్న రెండు మేకపిల్లలు అమ్మి ఓ కొట్టం గూడ ఏయిస్తి, తనకు బాయా? చెరువు కింద పొలమా. పచ్చగడ్డి ఎక్కడినుంచి వొస్తది. ఇంటిది కూలి మాని గడ్డి చెక్కుకొచ్చి పెడితే దాన్ని సరిగ తినదాయె!

రోజూ పిండి పెట్టాలనిరి.

పాల మోటరోడు నెలకు అరబస్తా పిండిస్తే సరిపోద్దాని కోడిపిల్లలమ్మి ఇంత తవుడు తెచ్చి గూడ పెడితి.

ఆ ఆవులను సాదాలంటె మాటలు కాదు. పేదోడు సాదలేడు.

మరి పేదరికం పోగొడతందుకే దాన్ని ఇస్తున్నాం అని ఆయాల్ల మీటింగులో సెప్పిరి. కాని దాన్ని సాదటంలో ఉన్న బాధలు ఎవరికి తెలుసు? ఒకరికి ఇద్దరం కూలి మాని గడ్డి గాదం తెచ్చి కాపల కాసి కాపాడిన ఆవు దక్కదాయె. మొదట

దూడ సచ్చె. అది సావంగానే దూడలేందె ఆవు పాలు ఇయ్యదంటె, సచ్చిన దూడను అమాంతం తిత్తి తీసి దాంట్లో ఇంత పొట్టు నింపి, ఎదురుగ నిలబెడితె పాలు ఎన్ని రోజులిస్తది? రెండు, మూడు రోజులిచ్చె పూకునె. ఆ తర్వాత అదీ సచ్చె, అది బతికి నన్ను బతికిస్తదేమో అనుకుంటే అదట్లాయే. అది ఎట్లా సచ్చిందని అడిగితే ఏం సెప్పను ఏమేమో రాసుకున్నరు. ఆవు దూడ బాపతు రకం కట్టమన్నరు. అప్పు అప్పే అన్నరు. ఎన్నాళ్ళు రెక్కలిరుసుకుంటే ఆరు ఎయిలు తీర్తయి. ఆవు వొచ్చిన్నాడు ఏడ్చిన కులపోల్లు ఉన్నది బాయె, కొన్నది బాయని నవ్వసాగిరి. కూలికి బోకుండ గడవదాయె. అందుకనే తెల్లారె పల్లెనిడిసి పట్నమొస్తి.

చేతిలో చెప్పులు.

చుట్టూర పనిముట్లు.

అదే కులవృత్తి.

అప్పుడేమో పాకముందట, ఇప్పుడేమో రోడ్డు పక్కన ఇక్కడ సంపాదన తక్కువ కర్చు ఎక్కువ, పోంగ సేతినిండ పనేది? మామూలోల్లు రబ్బర్ చెప్పులా, ఉన్నోల్లు కంపిని చెప్పులా! ఇంకా కొందరు బూట్లా? వాటిని తొడిగినన్ని రోజులు తొడిగి పారెయ్యడమేనా, ఆటికి రిపేరెక్కడిది? రిపేరు లేకుంటె మాకు ఇక్కడ పనెక్కడిది? పని లేకుంటె రూపాయెక్కడిది. రూపాయి లేకుంటె పొట్టెట్ల గడుస్తది? ఇగ పొలీసు పనంటర, బడి ఎగ్గొట్టిన పోరగాల్లు సంకల సంచి,

సేతిల బుర్సాయే. వోటల్ కాడ, రైల్లల్ల, సినిమాలకాడ అంతట ఆల్లేనాయె. అదీగాక ఇప్పుడొస్తున్న కొన్ని బూట్లకు పాలీసు గూడ అక్కరేలేదు, తుడుసుకుంటె సాలు, ఎంతున్న ఈ పన్ల పూట గడవదు. అప్పు తీరదు. అంతటా ఇంతేనేమో తెల్వదు గాని మన దేశంలో మాత్రం, సందాలంటే వందలిస్తరు, లంచాలంటె ఎయిలిస్తరు, కష్టం సేస్తోన్ని కనిపెట్టరు. కష్టం సేస్తోనికి అన్నీ కష్టాలే. మొన్ననే ఆస్టల్లో చేరిపించిన కొడుకన్నా ఈ పనినుండి తప్పించుకుంటాడో?

"ఇదిగో ఈ చెప్పులను కుట్టిస్తావా" అంటూ తన ఎదురుగ నిలుచున్న ఓ పెద్ద మనిషి మాటలు మళ్ళీ పనిలోకి దించినయి. తలవంచుకుని చెప్పులను రిపేరు చేస్తున్నాడు. ఈలోపు రోడ్డు మీద పోతున్న జీపుకు కట్టిన మైకులో "సోదరుల్లారా రేపు మా పార్టీ వాళ్ళు బందును ప్రకటించారు. కావున మీరంతా సహకరించి బందును విజయవంతం చేయ్యాల్సిందిగా మనవి" అంటూ మల్లి మల్లి ప్రకటిస్తూ జీపు మూడో చౌరస్తవైపు వెళ్ళింది.

"రేపు మల్ల బందా? ఇగ ఉపాసమే. వారానికో బందైతే ఎట్ల బతికేది" అంటూ తనలో తాను గునుక్కున్నాడు. అది విన్న పెద్దమనిషి....

"బందునాడు వచ్చిపోయే జనం ఉండరు. మీకు పని కూడ ఉండదు కదా!" రోడ్డున పోయే జీపు వైపు, ఆ తరువాత మల్లయ్య వైపు చూపులుంచుతూ అన్నాడు.

"ఏ పూట వచ్చినయి ఆ పూటేనాయె. ఏం రాకుంటె ఏం లేదు. మా బతుకుల్లో పస్తులే ఎక్కువ సారు?" కుట్టిన చెప్పును ఆయన ముందేస్తూ, రెండ వ చెప్పు కోసం చెయ్యి చాపుతూ "ఉన్న మారాజుకు ఏ బాధలూ లేవు. మాబోటోల్లకే తిప్పలు. కూలి లేకుంటె కూడు గడవదు. ఈ నెలలో నాలుగైదు బందులు. బడిపిల్లల బందు, నౌకర్‌దార్ల బందు, పార్టోల్ల బందు, దుకాన్‌దార్ల బందు, సస్తే బందు, కొట్టుకుంటే బందు, తిట్టుకుంటే బంద్. ఈ బందులతో బతకలేక పోతున్నంసారు" అంటూ రెండవ చెప్పును చేతిలోకి తీసుకొని చూస్తున్నాడు మల్లయ్య.

ఓ మాదిరి నవ్వుముఖంతో పెద్దమనిషి

"మనది ప్రజాస్వామ్యము బాబు, భరించక తప్పదు" అన్నాడు.

"అంటే"

"మన కోసం, మన ప్రభుత్వాన్ని మనమే ఎన్నుకోవటం."

"గ వోట్లేసేదా"

"అః అదే అదే."

"వోట్లేసినోల్లకే కూలి బందైతదని పార్టోల్లకు తెలవ కుండొచ్చునా"

"తెలిస్తే బందెందుకు చేయిస్తరు. అసలు ఆ విషయాన్ని వాళ్ళెప్పుడైనా ఆలోచిస్తె గదా"

అదెందో రాను రాను బరిసెలోడు. ఆడు హాయి,

తుపాకులోళ్ళొచ్చె, ఈ యిద్దరు పోంగ బాంబులోడు. ఎవరొచ్చిన ఆల్లాల్లు బాగానే ఉంటరు. మద్దెన జనాన్ని సంపుతుండ్రు. ఇట్లైతే ఈ లోకం ఉంటదా సారూ."

పెద్దమనిషి చిన్నగ నవ్వి, చెప్పులను తొడుక్కుంటూ "పత్రికవాడో, టీవీ వాడో నిన్ను పలకరిస్తే బాగుండు" అని జేబులో నుండి డబ్బు తీసి ఇచ్చాడు.

"అయ్యా ఇన్ని కనిపెడుతుండ్రు ఆకలి కాకుండా మందెందుకుకనిపెట్టరు?"

"దాన్ని కొనడానికి మళ్ళీ డబ్బులేకావాలి కదా"

అవును అన్నట్టు మౌనంగ తల ఆడిస్తూ -

"అయ్యా ఏమనుకోవద్దు, కడుపుల కాలి ఏదేదో ఒర్లిన" అంటూ చేతులు జోడించాడు.

"మాట్లాడే హక్కు అందరికీ ఉంది. అందులో ఉన్న మాటే అన్నావు" అంటూ అదే నవ్వు ముఖంతో అక్కడినుండి కదులుతున్నపుడు ఓ మంచి కొత్త పుస్తకం చదివినట్టు ఫీలయ్యాడు.

"నాయి మాటలు కాదు తండ్రీ బాధలు" అంటూ పెద్దమనిషి వెళుతున్న వైపే కనపడకుండా వెళ్ళేవరకు చూస్తుండిపోయాడు. ఆ తరువాత అంత దూరం నుండి కోతిని పట్టుకుని వస్తున్న ఓ ముదుసలి వైపు మల్లయ్య చూపులను మళ్ళించాడు.

కోతి మెడలోని గొలుసు మనిషి చేతిలో ఉంది. మనిషి చేతికర్ర కోతి భుజమ్మీద ఉంది.

మనిషికి కోతి ఆసరా? కోతికి మనిషి ఆసరా?

ఈ లోపల కోతి మల్లయ్య ఎదుటకొచ్చి గంతులేసింది. ఆ తరువాత చేయి చాపింది. దాని చేతలు చూస్తూ అన్నీ మరిచిపోయిన మల్లయ్య తాను కూర్చున్న గోనె సంచి మడతల్లో నుండి ఓ పావల తీసి కోతి చేతిలో పెట్టాడు.

కోతి సలాం కొట్టి ముందుకు నడిచింది. వెనకాల మనిషి! అప్పుడు ఎందుకో మల్లయ్య ముఖాన ఓ మాదిరి నవ్వు పూసింది. అది ఎలాంటి నవ్వో ఆయన లాంటి మనుషులు తప్ప మరెవరు చెప్పగలరు?

మార్చి 1995
ఇండియాటుడే